క్లుప్తంగా

చికిత్స పొందుతూ రైతు మృతి


బైరం జగన్ (ఫైల్)

కమలాపూర్ : మండలంలోని కానిపర్తికి చెందిన రైతు బైరం జగన్ (35) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. జగన్ అప్పుల బాధ తాళలేక ఈనెల 18న రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా కుటుంబీకులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పినట్లు ఎస్సై చెప్పారు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు. మృతుని తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

వేముల లక్ష్మికి నివాళి



ఐనవోలు : గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు, కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన వేముల నాగరాజు తల్లి లక్ష్మికి పలువురు ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. కక్కిరాలపల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, నగర మేయర్ గుండు సుధారాణి, బీజేపీ వరంగల్, హన్మకొండ జిల్లాల అధ్యక్షులు కొండేటి శ్రీధర్, రావు పద్మ, కాంగ్రెస్ పార్టీ హన్మకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, సిరిసిల్ల రాజయ్య, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, నమిండ్ల శ్రీనివాస్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, ప్రెస్ క్లబ్ కార్యదర్శి సదయ్య, ప్రసాద్ తదితరులు హాజరై లక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేశారు.

తీన్మార్ మల్లన్నపై పోలీసులకు ఫిర్యాదు

భీమదేవరపల్లి : హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ తీన్మార్ మల్లన్నపై మండలంలోని రాంనగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కనకం నరేష్, ఉపసర్పంచ్ కదిరె అయిలయ్య, దప్పు పోచయ్య వంగర ఎస్సై మానికరెడ్డికి గురువారం ఫిర్యాదు చేశారు.

సర్వసభ్య సమావేశం వాయిదా



పరకాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం తలపెట్టిన సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ఎంపీపీ స్వర్ణలత అధ్యత వహించగా సర్పంచ్‌లు, అధికారులు మాత్రమే హాజరయ్యారు. ఎంపీటీసీలందరూ గైర్హాజరు కావడంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ స్వర్ణలత ప్రకటించారు.

నేటి నుంచి ప్లీనరీ



పరకాల : ఈనెల 20 (శుక్రవారం) నుంచి భారతీయ మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) జిల్లా ప్లీనరీ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నీల రవీందర్ తెలిపారు. పరకాల పట్టణంలో నిర్వహించనున్న ప్లీనరీల కరపత్రాన్ని పట్టణంలోని అమరధామంలో గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గత అనుభవాలతో భవిష్యత్ ప్రజాఉద్యమ నిర్మాణం కోసం కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ నాయకులు ఎస్‌రెడ్డి హంసరెడ్డి, మంద భద్రయ్య, నవీన్‌కుమార్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబానికి చేయూత

భీమదేవరపల్లి : మండలంలోని ముత్తారం తండాకు చెందిన లావుడ్యా వెంకన్న ఇటీవల మృతి చెందగా అతడి కుటుంబానికి అతడి టెన్త్ నాటి మిత్రులు గురువారం చేయూత అందించారు. బాధిత కుటుంబానికి వెంకన్నతో కలిసి పదో తరతి చదువుకున్న స్నేహితులు రూ.20 వేల నగదుతోపాటు 50 కేజీల బియ్యంతోపాటు నిత్యావసర సరుకులు అందించారు. వెంకన్న కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సాయం అందించిన వారిలో మహేష్, అనిల్, యుగేందర్, దిలీప్, తిరుపతి, చరణ్, దీపక్‌రెడ్డి తదితరులున్నారు.

అంధత్వ రహిత సమాజ స్థాపనే లక్ష్యం

● వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి

శాయంపేట : అంధత్వ రహిత సమాజ స్థాపనే సీఎం కేసీఆర్ లక్ష్యమని వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి తెలిపారు. శాయంపేటలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో, సూర్యనాయక్‌తండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను ఆమె ముఖ్యఅతిథిగా హాజరై గురువారం ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోని 18 ఏళ్లకు పైబడ్డ ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ రామిశెట్టి లత లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, సర్పంచ్‌లు కందకట్ల రవి, భూక్య రమేష్, పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ మారంపల్లి నందం, పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : అంధత్వ నిర్మూలనే లక్ష్యంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించారని జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్ తెలిపారు. మండలంలోని కేశవాపూర్, గోపాల్‌పూర్ గ్రామాల్లో రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ ముందుచూపుతో కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల స్వప్న, ఎంపీడీఓ తూర్పాటి సునీత, వైస్ ఎంపీపీ తంగెడ నగేశ్, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, సర్పంచ్ ఈర కృష్ణవేణి మహేందర్, మాసిపెద్ది భాస్కర్‌రావు, ఎంపీటీసీ కడారి రాజు, వైద్యులు హెక్తేదార్ హైమ్మద్, శోభారాణి, సూపర్‌వైజర్ జునేది, తదితరులు పాల్గొన్నారు.

ధర్మసాగర్ : మండలంలో కంటివెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీలు నిమ్మ కవిత, కేసిరెడ్డి సమ్మిరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమాల్లో ఆయా మండలాల ప్రత్యేక అధికారులు వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రావు, జెడ్పీటీసీలు పిట్టల శ్రీలత, చాడ సరిత, ఎంపీడీఓ గార్లపాటి జవహర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎర్రబెల్లి శరత్, కర్ర సోమిరెడ్డి, కుర్సపల్లి నవ్య, కాయిత మాధవరెడ్డి, వైద్యాధికారులు గోపీనాథ్, ఆనంద్‌కుమార్, గీతారాణి, సీహెచ్‌ఓ నెహ్రూ చంద్‌నాయక్, పాక శ్రీదేవి, కాజీపేట ఏసీపీ శ్రీనివాస్, సీఐ ఒంటేరు రమేశ్, ఎస్సైలు సాయిబాబు, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు : మండలంలోని ఐనవోలు, కొండపర్తి పీహెచ్‌సీల్లో కంటివెలుగు కార్యక్రమాన్ని జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములుతో కలిసి ఎంపీపీ మార్నేని మధుమతి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తంపుల మోహన్, మెడికల్ ఆఫీసర్లు శ్రీనివాస్, సుభాష్, సర్పంచ్‌లు జన్ను కుమారస్వామి, కట్కూరి రాజమణి, ఎంపీటీసీ కలప్న, తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ : మండలంలోని కమలాపూర్, మాదన్నపేట, భీంపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాలను ఎంపీపీ తడక రాణి శ్రీకాంత్ ప్రారంభించి మాట్లాడారు. డాక్టర్ హర్షిణీ ప్రియ కార్యక్రమాన్ని వివరించారు. కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారి జగదీశ్వర్, జెడ్పీటీసీ లాండిగె కళ్యాణి లక్ష్మణ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ పేరాల సంపత్‌రావు, సర్పంచ్‌లు కట్కూరి విజయ తిరుపతిరెడ్డి, గుండపు చరణ్‌పటేల్, పద్మ కుమారస్వామి, తహసీల్దార్ రాణి, ఎంపీడీఓ పల్లవి, ఎంపీఓ విమల, ఇన్‌స్పెక్టర్ సంజీవ్, వైద్యులు శివకుమార్, మౌనిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక పాల్గొన్నారు.

నడికూడ : మండల కేంద్రంలో కంటివెలుగు కార్యక్రమాన్ని జెడ్పీటీసీ కోడెపాక సుమలతతో కలిసి ఎంపీపీ మచ్చ అనసూర్య ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, డీఎంహెచ్‌ఓ లలితదేవి, సర్పంచ్ రవీందర్‌రావు, ఎంపీటీసీ అప్పం చేరాలు, వైద్యులు వెంకటనారాయణ, ప్రదీప్‌కుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


శాయంపేట : మాట్లాడుతున్న గండ్ర జ్యోతి


ఎల్కతుర్తి : ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ సుధీర్


ధర్మసాగర్ : ప్రారంభిస్తున్న ఎంపీపీలు


ఐనవోలు : పరీక్ష చేయించుకుంటున్న ఎంపీపీ


కమలాపూర్ : పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు


నడికూడ : ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

ఉపకరణాలతో బోధిస్తే గుణాత్మక విద్య


తరగతులను పరిశీలిస్తున్న ఏఎంఓ శ్రీనివాస్

కమలాపూర్ : ఉపకరణాలతో బోధిస్తే గుణాత్మక విద్య అందుతుందని తొలిమెట్టు కార్యక్రమ జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంఓ) శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని గూడూరు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన సందర్శించి బోధనా తీరును ప్రత్యక్షంగా పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు అందించారు. విద్యార్థుల్లో సామర్థ్యాలను వెలికి తీయడంలో ఉపకరణాలు ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థుల సామర్థ్యం పెంచేలా ఉపాధ్యాయులు తరగతులు బోధించాలని సూచించారు. తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శివప్రసాద్, హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీదేవి, విజయ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక


బీజేపీలో చేరిన వారితో ఎమ్మెల్యే రాజేందర్

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లికి చెందిన 20 మంది వివిధ పార్టీల నాయకులు హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే రాజేందర్ కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తొలుత కక్కిరాలపల్లి శివారులో ఆ పార్టీకి చెందిన న్యాయవాది నాగరాజు నిర్వహిస్తున్న గోశాలను ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సందర్శించారు బీజేపీలో చేరిన వారిలో గూబ దేవేందర్, కాటబోయిన మహేందర్, పొన్నం రాజు, దిలీప్, కళాధర తోట రవి, దండు శ్రీను, రమేష్, రాజు, సందీప్, దేవేందర్, వినోద్, మురళి, వంశీ, ఎల్లయ్య, కుమారస్వామి ఉండగా కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లాల అధ్యక్షులు కొండేటి శ్రీధర్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే సుపరిపాలన


కండువా కప్పుతున్న మనోహర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి

శాయంపేట : బీఆర్‌ఎస్‌తోనే సుపరిపాలన అందుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి తెలిపారు. మండలంలోని గంగిరేణిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పోతు రాజ్‌కుమార్ బీఆర్‌ఎస్‌లో గురువారం చేరగా మనోహర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామిశెట్టి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం


విజేతలతో నిర్వాహకులు, నాయకులు

శాయంపేట : క్రీడలతో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని అంబేద్కర్ విద్యార్థి సమాఖ్య జిల్లా కన్వీనర్ నాగుల పవన్‌కళ్యాణ్, సీనియర్ జర్నలిస్ట్ అంకేశ్వరపు ఐలయ్య, బీఎస్‌ఎస్ జిల్లా కార్యదర్శి మగ్గం సుమన్ తెలిపారు. సంక్రాంతి సందర్భంగా మండలంలోని పత్తిపాక గ్రామంలో నిర్వహించిన అంబేద్కర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు గురువారం ముగియగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. యువత చదువులతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. మొదటి బహుమతిగా రూ.10 వేల నగదుతోపాటు ట్రోఫీని అంబేద్కర్ యువజన సంఘం జట్టుకు, శాయంపేటకు చెందిన రింకూ జట్టుకు రూ.6 వేల నగదుతోపాటు ట్రోఫీని బహుమతిగా అందజేశారు. బెస్ట్ ప్లేయర్‌గా నాలుగ కల్యాణ్, బెస్ట్ బౌలర్‌గా అంకేశ్వరపు భాను నాస్తిక్, బెస్ట్ ఆల్‌రౌండర్‌గా గాజు సాయి నిలువగా వారికి షీల్డ్‌లు అందజేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ విద్యార్థి సమాఖ్య మండల అధ్యక్షుడు నాలికె ప్రతాప్, యువజన సంఘం అధ్యక్షుడు బొల్లెపల్లి ప్రసాద్, స్పోర్ట్స్ సెక్రెటరీ వినయ తరుణ్, రాజశేఖర్, నరేష్, స్టాలిన్, వికాస్, సాయి తిలక్, గాంధీ, మనోజ్‌కుమార్, పూలె యువజన సంఘం అధ్యక్షుడు చెల్పూరి శ్రీకాంత్, రజిని పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌కు ఎమ్మెల్యే పరామర్శ


ఐనవోలు : పరామర్శిస్తున్న ఎమ్మెల్యే, ఇతరులు


పరకాల : పరామర్శిస్తున్న ఈటల రాజేందర్


శాయంపేటలో..

ఐనవోలు : డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావును మండల కేంద్రంలోని ఆయన నివాసంలో బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్, రైతు రుణ విమోచన కమిషన్ రాష్ట్ర చైర్మన్ నాగుర్ల వెంకన్న గురువారం పరామర్శించారు. ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో నిర్వహించిన జాతరలో ప్రమాదవశాత్తు జారిపడి కాలుకు గాయం కావడం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన తీరు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రవీందర్‌రావును పరామర్శించిన వారిలో వర్ధన్నపేట జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు, అధికార ప్రతినిధులు పోలెపల్లి శంకర్‌రెడ్డి, బుర్ర రాజశేఖర్, పల్లకొండ సురేష్, మరుపట్ల నరేష్, దుప్పెల్లి కొంరయ్య, నోముల ఆగయ్య ఉన్నారు.

ఆర్మీ అధికారి కుటుంబానికి..

పరకాల : పరకాల పట్టణానికి చెందిన ఆర్మీ మేజర్ దూడపాక సాయికిరణ్ కుటుంబాన్ని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ గురువారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అందాల్సిన సాయంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో మాట్లాడుతానని రాజేందర్ తెలిపారు. సాయికిరణ్ మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు, కార్యకర్తలున్నారు.

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ దేవు సాంబయ్య తల్లి లక్ష్మి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పరామర్శించారు. తొలుత లక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, కన్నెబోయిన రాజయ్యయాదవ్, డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్, జయంత్‌లాల్, సత్యపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల మధ్య చిచ్చు పెట్టేలా కుట్ర


మాట్లాడుతున్న కర్రె భిక్షపతి

కమలాపూర్ : కేంద్రంలోని బీజేపీ ప్రజల మధ్య చిచ్చు పెట్టేలా కుట్ర చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి విమర్శించారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని చెప్పారు. జాతీయవాదం, మతోన్మాదంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ధ్వజమెత్తారు. సంపన్నులకు, కార్పొరేట్ శక్తులకు కోట్లాది రూపాయల రాయితీలు ఇస్తూ పేదలను మరింత దారిద్ర్యంలోకి నెడుతోందని మండిపడ్డారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల భర్తీ, నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో వైఫల్యం, కరోనా సమయంలో ఐదు లక్షల పరిశ్రమలు మూతపడటంపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బడ్జెట్‌లో కోత విధించడంతో గ్రామీణ ప్రజలకు ఉపాధి కరువైందన్నారు. సీఎం కేసీఆర్ పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడంలో, డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వడంలో విఫలమయ్యారని తెలిపారు. ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలిచ్చి ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు చొప్పున సాయం అందించాలని డిమాండ్ చేశారు. ప్రజాచైతన్యం దిశగా శ్రేణులు పని చేయాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ మండల కార్యదర్శి నకీర్త ఓదెలు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జక్కు రాజుగౌడ్, నాయకులు బాలరాజు, శంకర్, రవి, సమ్మయ్య, లక్ష్మి, శిరీష, అఖిల పాల్గొన్నారు.

కొత్తకొండ జాతరకు కొనసాగుతున్న భక్తుల రద్దీ

భీమదేవరపల్లి : మండలంలోని కొత్తకొండ గ్రామంలోని వీరభద్రస్వామి జాతరకు భక్తుల రద్దీ కొనసాగుతుంది. గురువారం మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ప్రధాని పీవీ.నర్సింహారావు సోదరుడి కుమారుడు, తెలంగాణ గ్యాస్ డీలర్ల మీడియా రాష్ట్ర సమన్వయకర్త మదన్‌మోహన్–సంధ్యారాణి దంపతులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మదన్‌మోహన్ వెంట బ్రహ్మణ సంఘం మండల శాఖ అధ్యక్షుడు నాగిళ్ల కృష్ణమూర్తి, ఆలయ ఉప ప్రధాన అర్చకులు రాజన్న, సదానందం, రాంబాబు, వీరభద్రయ్య తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

శాయంపేట : మండలంలోని గంగిరేణిగూడెం గ్రామానికి చెందిన పోతు వెంకటయ్యకు మంజూరైన రూ.48 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆయనకు ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ తిరుపతిరెడ్డి మాట్లాడారు. సీఎంఆర్‌ఎఫ్ పేదలకు లబ్ధి చేకూర్చుతోందని తెలిపారు. పేదలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకుని లబ్ధి పొందాలని సూచించారు. పేదలకు అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు లక్ష్మారెడ్డి, మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, సర్పంచ్ శానం మంజుల పరమేశ్వర్, గ్రామ శాఖ అధ్యక్షుడు గండి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

గుడిసెవాసులకు పట్టాలివ్వాలి


వినతిపత్రం అందజేస్తున్న రాములు, నాయకులు

ధర్మసాగర్ : మండలంలోని ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుమ్మడి రాజుల రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పేదలు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించగా రాములు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలిస్తామని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చి అమలు చేయడాన్ని విస్మరించిందని విమర్శించారు. స్థలమున్న పేదలకు ఇల్లు కట్టుకోవడానికి రూ.3 లక్షలిస్తామని కొద్ది కాలంగా ప్రభుత్వం చెబుతుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రూ.3 లక్షల వ్యయంతో ఇల్లు ఎలా నిర్మించుకుంటారని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇళ్లు కట్టించాలని, లేదంటే రూ.5 లక్షలు సాయం అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ రజనీకి వినతపత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కోశాధికారి బొల్లం సాంబరాజు, కార్మిక సంఘం జిల్లా నాయకులు అంబాల స్వరూప, ఈర్ల సురేందర్, సతీష్, ఆరూరి భాగ్య, వెంకటయ్య, సరోజన, అంబాల మమత, అరుణ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను తొలగించాలి


మాట్లాడుతున్న సాంబయ్య

శాయంపేట : మండలంలోని మాందారిపేట స్టేజీ నుంచి ప్రగతి సింగారం గ్రామం వరకు రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలని తెలంగాణ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి వంగరి సాంబయ్య ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు నిర్మాణ క్రమంలో మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాల్సి ఉందన్నారు. రోడ్డు మధ్య విద్యుత్ స్తంభాలు ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. బీటీ రోడ్డు నిర్మాణంలో కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించలేదని తెలిపారు. అధికారులు స్పందించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ పార్టీ మండల కార్యదర్శి తట్ల రమేష్ పాల్గొన్నారు.

పనిలో నిబద్ధత, అంకితభావం ముఖ్యం



కొమురయ్య దంపతులను సన్మానిస్తున్న రిజిస్ట్రార్

కేయూ క్యాంపస్: పనిలో నిబద్ధత, అంకితభావం చాలా ముఖ్యమని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు అన్నారు. వసతిగృహంలో ఉద్యోగిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఎ.కొమురయ్యను విశ్వవిద్యాలయం కమిటీహాల్‌లో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ వసతిగృహంలో పనిచేయటం అనేది కత్తిమీద సాములాంటిదని తెలిపారు. అనంతరం, కొమురయ్య దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో కేయూ ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్య, హాస్టళ్ల డైరెక్టర్ డాక్టర్ మంజుల, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన మొరం టిప్పర్


టిప్పర్‌ను పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఎస్సై డేవిడ్

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్ రోడ్డు ఇసుక అడ్డా జంక్షన్‌లో గురువారం తెల్లవారుజామున డివైడర్‌ను టిప్పర్ అతివేగంగా ఢీకొట్టడంతో ముందు చక్రాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సంఘటనా స్థలాన్ని ట్రాఫిక్ ఎస్సై డేవిడ్ సందర్శించి వివరాలు సేకరించారు. రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగిస్తున్న టిప్పర్‌ను భారీ క్రేన్ సాయంతో పక్కకు తొలగించారు. కాగా, చీకటి మాటున మొరం వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్రధానంగా నాయుడు పెట్రోల్ బంక్, ఉర్సుగుట్ట, తాళ్ల పద్మావతి కళాశాల సమీపంలో మొరం మట్టిని డంపింగ్ చేస్తున్నారు. అక్కడి నుంచి మొరం మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తూ వ్యాపారులు అక్రమంగా రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారుల కళ్లు గప్పి రాత్రికి రాత్రే ఎక్కువ ట్రిప్పులు కొట్టాలనే దురాశతో రహదారులపై డ్రైవర్లు అతివేగంగా వెళ్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

ఖిలా వరంగల్ : వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని 33వ డివిజన్‌లోని శాంతినగర్ కాలనీలో మహాత్మాగాంధీ పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 32 సీసీ కెమెరాలను ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్, కార్పొరేటర్ ముస్కమల్ల అరుణ, బీఆర్‌ఎస్ నాయకుడు ముస్కమల్ల సుధాకర్‌తో కలిసి ఎమ్మెల్సీ డాక్టర్ బండా ప్రకాశ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ మాట్లాడారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో కాలనీలకు భద్రత లభిస్తుందని తెలిపారు. ప్రతిఒక్కరు వ్యక్తిగతంగా తమ ఇంటి ఎదుట సీసీ కెమెరాలు బిగించుకోవాలని సూచించారు. తద్వారా ఆగంతకుల నుంచి రక్షణ పొందాలని చెప్పారు. అనంతరం ఎమ్మెల్సీ డాక్టర్ బండా ప్రకాశ్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌లను సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజేందర్, కుమార్, సుమన్, శ్రీలత, మహాత్మాగాంధీ పరపతి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.